

# యాత్రికులు

శ్రీసుభా





## వారం వారం కథాప్రభ

నేను మా అమ్మ అస్తికలు కలపడానికి కాశీ వెళ్లా లనుకోకపోతే ఈ కథ ఉండేది కాదేమో! కాశీ అంతకుముందు నేను వెళ్లలేదు. ఇదే మొదటిసారి. కానీ నేను ఎదుగుతూ ఉంటే నాకు కాశీ గురించి మా బామ్మ, అమ్మమ్మ, తాతయ్య చెప్తూనే వచ్చారు. నిజానికి నే నేమిటి — ప్రతి భారతీయుడు చిన్నతనంలోనే కాశీ గురించిన కథలు వింటాడు. కాశీ గురించి కలలు కంటూనే ఉంటాడు. గంగా నదిలో స్నానం చేసి చేసిన పాపాలకు చరమగీతం పాడడం, ఆ తర్వాత విశ్వనాథుణ్ణీ, విశాలాక్షిని దర్శించడం — ఆఖరిగా మరో పుట్టుక తద్వారా వచ్చే అవస్థల్ని తప్పించుకుందుకు — అక్కడ మరణాన్ని వరంగా కోరుకోవడం ... అలా అలా ...

నేను కాశీ ప్రయాణం పెట్టుకున్నానని తెలిసి ఒకళ్లిద్దరు స్నేహితులు నన్ను నిరుత్సాహపరిచారు. "అక్కడికి పోయి పాపాలు పోగొట్టుకుని పుణ్యం, ఆపైన జన్మరాహిత్యం సంపాదించడం ఆ విషయాలు అటుంచు ... అక్కడ భగవంతుడి పేర పండారీలు చేసే దోపిడీ, విశ్వనాథ ఆలయంలో ప్రశాంతతను భంగపరిచే భక్తుల రొదను నువ్వు భరించలేవు. ముఖ్యంగా అక్కడి జనంలోని క్రమశిక్షణా రాహిత్యం చూస్తే వెగటు పుట్టి తల వంచుకో వల్సి వస్తుంది" అన్నాడు రాజు.


"ప్రతి మతస్థుడూ తన దేవుడికి మొక్కేటప్పుడు ఒక విధమైన ప్రశాంతతని ఆశిస్తాడు. కానీ మనం గుడికి వెళ్లి హడావుడి చేస్తాం. అక్కడా మనం మన ఇబ్బందుల్ని మర్చిపోలేకపోతాం. నా కనిపిస్తుంది — మనకు మన దేవుళ్లంటే భక్తి శ్రద్ధలకన్నా లోకువే ఎక్కువని! ఆయనగారు మొక్కించుకున్న నేరానికి వరాలు ఇవ్వలేకపోతాడా అని ..." జయప్రకాశ్ అన్నాడు.

నేను వాడి మొహం వైపు అయిష్టంగా చూశాను. వాడు నవ్వు ఆపాడు.

"చూడు, ప్రకాశ్! నీ వాదన తప్పు. మనం మన దైవాలను మన మాదిరే మన ఛాయా రూపాలనుకుని ఊహించి పూజలూ అవీ చేస్తాం. వాళ్లూ మనలాగే చిన్నతనంలో ఆట పాటలు అల్లరి చేస్తారనీ, ఆనందిస్తారనీ, సతులతో సరస సల్లాపాలు ఆడతారనీ మనసా వాచా నమ్ముతాం. నిజం చెప్పద్దూ, దేవుడు ప్రత్యక్షమైతే భయపడకుండా ఆయనతో చేతులు కలిపి నడిచే అమాయక భక్తులు, ఆవేశపరులు ఒక్క మన హిందువుల్లో తప్ప మరెక్కడా కనబడరు."

"నువ్వు హిందూతత్వ వాదివి" అన్నాడు రాజా వేళాకోళంగా.

"అది నీ ఊహ. అందులో తప్పేం లేదు. అభిప్రాయాలు వెల్లడించవచ్చు. కానీ మన మతంలో ఉంది చూడు, స్వేచ్ఛ. అదే కొందరిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లి తాత్విక చింతనకు కొత్త భాష్యాలు చెప్పేటట్లుగా తీర్చి దిద్దింది. దీనికి తార్కాణంగా ఎందరివో పేర్లని చెప్పొచ్చు. ప్రపంచంలో ఏ చట్రంలోనూ ఇమడలేనిది, ఇమడ్చడానికి వీలు కానిది మన మతమే. బాగా ఆలోచించు, నీకే అర్థమవుతుంది."



అలా చాలాసేపు మేం వాదించుకున్నాం. ఎవరి దారిన వాళ్లం విడిపోయాం. నేను కాశీ వెళ్లడం జరిగింది. కాశీ చరిత్ర గంగానది ప్రవాహంలాంటిదే. హరిశ్చంద్ర ఘాట్ దగ్గర ఒక బ్రాహ్మణుణ్ణి బతిమిలాడి చిన్న గది అద్దెకు తీసుకున్నాను. బయటకు వచ్చి కూర్చుంటే గంగానది ఉదయకాలపు ఉషస్సులో నమ్రతగా, తెల్లగా స్కూలుకు వెళ్లే చిన్న పాపలా కనిపించింది. మధ్యాహ్నానికి, అలిసి కాస్త మాగన్ను తీస్తున్న గృహిణిలా అనిపించింది. తీరా సాయంకాలం అయ్యేసరికి ఎర్ర చీర ధరించి యవ్వనవతిలా కనీ కనిపించకుండా విజృంభించడం, అంతలోనే చీకటితో చెయ్యి కలిపి నల్ల చీర ధరించి ప్రకృతి పడక గదిలోకి నిష్క్రమించిన వాసవ సజ్జికగా మారడం — అలా ఆలోచిస్తూనే ఉన్నాను. ఈ గంగానదికి వయసు ఎంత ఉండి ఉండచ్చు? ఎవరు చెప్తారు? ప్రకృతీ, ప్రవాహాలు — వీటి పూర్వ జన్మ రహస్యాన్ని భేదించడం ఎలా? ఈ గంగానదిలో మొదటిసారి జలకా లాడిన,

నీతం అయిన వ్యక్తులు ఎవరు? వాళ్లు పురుషులా, స్త్రీలా? చటుక్కున మా అమ్మ గుర్తొచ్చింది. ఆమె అయితే వెంటనే పార్వతీ పరమేశ్వరులు అని చెప్పేది. అదే నాన్న అయితే లక్ష్మీనారాయణుల పేరు చెప్పేవాడు. అత్తయ్య బ్రహ్మ, సరస్వతులని చెప్పి — తన వాదనే కరెక్ట్ అనేది. కానీ ఆత్మావలోకనం చేసుకున్నవాళ్లు — ఆ మార్గంలో అనంత లోకాలను దర్శించినవాళ్లు నా ప్రశ్నలకు జవాబు చెప్పరు. మౌనంగానో, లేక చిరు దరహాసంతోనో తల పంకిస్తారని తెలుసు. ఇంతలో నేను మాట్లాడిన బ్రాహ్మణుడు వచ్చి గుమ్మం దగ్గర నిలబడ్డాడు. ఆయన్ని ఆహ్వానించాను. మరునాడు నేను చేయబోయే విధుల గురించి ఆయన చెప్పడం మొదలుపెట్టాడు. నా పేరు అడిగాడు. "భాస్కరరావు" అని చెప్పాను. కులం, గోత్రం అడిగాడు. నవ్వు వచ్చింది. చెప్పక తప్పలేదు.

★ ★ ★

తెల్లవారింది. అపరాహ్నం వేళ నేను విఘ్నేశ్వర శర్మ గారి సహాయంతో మా అమ్మ అస్తికలు గంగలో నిమజ్జనం చేసే కార్యక్రమం మొదలుపెట్టాను. ఆ తంతుకు గంట పైగానే పట్టింది. అస్తికలు గంగలో ఒక్కొక్కటీ విడిచిపెడుతూంటే నా కెందుకో ఒళ్లు గగుర్పొడిచింది. ఓ బాధలాంటిది శరీరం అంతా ఆక్రమించింది. ఏ వేవో జ్ఞాపకాలు, నరాల్లో ప్రవహించే రక్తాన్ని సజావుగా వెళ్లనీయకుండా అడ్డుకున్నట్టు ... తద్వారా అలజడి — ఆ అలజడి వేగంగా సాగే అలలై అవి కళ్లు రెండింటిని తాకినట్టు ...కానీ కళ్లు కన్నీటి మడుగులు కాలేదు. కనుగుడ్లు మాత్రం నీటి పొరలను పొదగడం చేస్తూంటే చటుక్కున నేను భుజం మీది తువ్వాలుతో ఆ పనిని ఆపాను.

గంగపాలైన అమ్మ అస్తికలు — నీటిలో మునిగే ముందు నాచేతికి ఆఖరి వీడ్కోలు ఇచ్చిన అనుభవం. పేగు అనే బంధానికి ఎన్ని ముళ్లు పడి ఉంటాయో అర్థమయ్యే ఘడియలవి. కానీ మరణం అనే ఒక మిష మీద మనుషుల్ని మాయ చేసి భవ బంధాల్ని తెంచుకుని వెళ్లిపోతుంది ఆత్మ! "మళ్లీ కలుద్దాం, మళ్లీ వస్తాను" అంటూ రహస్య సంకేతాలు వినిపించి 'ఈ శరీరంతో నా చెలిమికి స్వస్తి. అంతమాత్రమే ... మరో శరీరంతో కూడా కొత్త అనుబవాల్ని పంచుకోనివ్వు' అన్నట్టుగా నిశ్శబ్దంగా నిష్క్రమిస్తుందిట ఆత్మ!! పైగా వెళ్లేటప్పుడు కృతజ్ఞతతోనో లేక తప్పదన్నట్టో శరీరం తాలూకు వాసనలను వెంటబెట్టుకుని పోవడం ఎంత ఆశ్చర్యం!!

విఘ్నేశ్వర శర్మకు తంతు చేయించినందుకు డబ్బు ముట్టజెప్పి, గంగలో నీళ్లు నాలుగు దోసిళ్లు తాగి మెట్లెక్కి నా గదికి జేరాను. గది తాళం తీస్తుంటే ఓ మాట వచ్చి, నా వీపును తాకింది. వెనుతిరిగి చూశాను.

"మీరు ..." అని ఆగిపోయింది. ఎవరో విదేశీ అమ్మాయి — ఇంగ్లీషులో మాట్లాడుతోంది.

"నేను ..."

ఆమె నావైపు మరోసారి చూసి తను ఇజ్రాయెల్ దేశస్థురాలి నని రెండేళ్లుగా ఇండియాలో ఉంటున్నా నని, టూరిజం డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాననీ, తన పని పురోభివృద్ధి పథంలో పయనిస్తున్న భారతదేశపు పురాతన అధునాతన వస్తు సముదాయాల గురించి వివరించడమనీ, ఫోటోగ్రఫీ తనకు మరో ఇష్టమైన విషయమనీ, తన దేశం వెళ్లి ఓ ఆల్బమ్‌గా వాటిని తీర్చిదిద్దుతాననీ, తన పేరు 'సజ్' అనీ చెప్పింది.

నే నా పేరు ఒకటికి రెండుసార్లు మననం చేసుకుంటుంటే ఆమె తన విజిటింగ్ కార్డ్ ఇచ్చింది. ఆమె పేరు ఇంగ్లీషులో ఎస్.ఎ.టి.జెడ్.గా గుర్తించాను. దానిని తెలుగులోకి ఎలా ఉచ్చరించాలో ఆలోచిస్తూంటే మనకు దగ్గరైన పేరు సజ్జని గుర్తొచ్చింది.

"లోపలికి రండి. కూర్చుందాం. నా పేరు భాస్కరరావు. మీరు 'రావ్' అనండి చాలు."

సజ్జని లోపలికి వచ్చింది. ఆమె చాలా పొడగరి. కానీ, లావు సన్నాల గురించి వితర్కించుకునే అవకాశం లేకుండా మధ్యస్థంగా ఉంది. కోల మొహం, నీలం కళ్లు, పాలరాతి ఛాయ. తెల్లని టీ షర్ట్, తెల్లని జీన్ పాంట్, తెల్లని షూస్. చేతిలో ట్రావెల్ బాగ్ కింద పెట్టి, నేను వేసిన చాప మీద ఓ పక్కగా కూర్చుంది.

"నేను పనిమీద ఈ ఊరు వచ్చినవాణ్ణి. సాదా సీదా ఉద్యోగిని. నా వల్ల మీకు ఏం ఉపకారం కావాలో చెప్పండి."

సజ్ — అదే సజ్జని నవ్వింది.

"మిమ్మల్ని నిన్న స్టేషన్‌లో చూశాను. మీరు యూనివర్సిటీ దగ్గర బుక్‌స్టాల్‌లో కొన్న పుస్తకాల వివరాలు నాకు తెలుసు. అలాగే మీరు గంగ ఒడ్డున పూజలు చేయడం గమనించాను.

"మా ప్రభుత్వం నన్ను అనుమానించి ... మిమ్మల్ని నా మీదకు ..."

"కాదు, కాదు" అని, కుడి చేత్తో న వ్వాపుకుందుకు దాన్ని చిన్న నోటి వరకూ తీసుకువెళ్లి, తిరిగి నవ్వు తనకి తనే ఆగిపోతే చేతులు కలుపుకుంది.

"మిమ్మల్ని చూడగానే మీతో మాట్లాడాలనిపించింది. ఈ ఉద్యోగ నిర్వహణలో నేను చాలా ప్రదేశాలు తిరిగాను. చాలామందిని కలిశాను. 'డిస్టినేషన్ షాపింగ్' అనేది నా వృత్తి ధర్మం. అది మీ దేశపు పైపై మెరుగుల్నే కాకుండా లోతుల్లోకి తీసుకువెళ్లి అక్కడ అందాల్ని కూడా చూసేటట్టు చేసింది."

"అది మా అదృష్టం అని నేను అంటాను."

"కాదు నాదే అని నేను అంటాను. ఈ దేశంలో జనం ప్రపంచంలోని మిగతా మనుషులకు విరుద్ధంగా, వింతగా ఉంటారు. మానవ బలహీనతలతోపాటు మీలో తళుక్కుమని మెరుస్తూ మురిపించే ఆత్మీయత. ఆ ఆత్మీయత పొరల్లోంచి ఉండుండి ఉబికే వేదాంతం. ఇంకా ఇంకా సుగుణాలు ... నాకు ఎంతో ఆశ్చర్యం వేస్తుంది. ఏమీ తెలియని మనుషులు కూడా దేవుడి దగ్గర నుంచి అధికంగా వరాలు పొంది ఈ నేలలో జన్మించగలుగుతారని."

నేను నవ్వేశాను. "అదేం లేదు. తూర్పు దేశాల్లో మాదిరి మా దేశంలోనూ మేధావులు స్తబ్దుగానో లేక విపరీత ధోరణులవైపో పోతూనే ఉన్నారు. దైవాన్ని అవసర వస్తువుగా మాత్రమే గుర్తిస్తూ ఆయన ఉనికికే కొత్త అర్థాలు చెబుతున్నారు. కానీ కొంతమంది చెప్తున్నారులెండి, రాబోయే రోజుల్లో మనిషి తనకు తానే ఆద్యంతాలు అనుకోవడం తప్పని తెలుసుకుంటాడని! దైవాన్ని తనలోనూ అందరిలోనూ గుర్తించడం మొదలుపెడతాడని ..."

"నిజమే. ఆ విషయం చాలాచోట్ల, ముఖ్యంగా రష్యాలో మొదలైందనే మేం అనుకుంటూ ఉంటాం." సజ్జని అంది.

"మీ పేరు పలకడం కొంచెం కొత్తగా ఉంది. ఏ అక్షరాన్ని నిశ్శబ్దంగా వదలాలో తెలియలేదు. అందుకే కొంచెం మార్చి తెలుగు పేరు సజ్జని అంటున్నాను. అంటే మంచి అమ్మాయి అని అర్థం."

సజ్ ఆశ్చర్యంగా చూసి, తల ఊపి, ఆపైన చిన్నగా నవ్వి "సజ్జని" అని ఒకటికి రెండుసార్లు అంది పైకి. ఆ తర్వాత తల పంచుకుని, "ఇక్కడి మీ వేదాంతుల గురించి తెలుసుకోవాలని ఉంది. మీ జీవితాల్లో కలిసిపోయి విడదీయడానికి వీలు లేకుండా, పైగా అదృశ్యంగా ఉండే మీ దైవాన్ని మీతోపాటు దర్శించాలని

## అవార్డుల థెరిసా

శాంతిదూత మదర్ థెరీసాకు లభించినన్ని ప్రముఖ అవార్డులు ప్రపంచంలో మరెవ్వరికీ లభించలేదు. ఆమెకు ఇప్పటివరకు నోబెల్ శాంతి బహుమతితో సహా మొత్తం పదకొండు ముఖ్యమైన అవార్డులు లభించాయి. అవి:

మెగాసెసే అవార్డు (1962), కెన్నడీ ఇంటర్నేషనల్ అవార్డు (1971), టెంపుల్‌టన్ అవార్డు (1972), జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు (1972), నోబెల్ శాంతిబహుమతి (1979), భారతరత్న (1980), భారత్‌కి మహాన్ సుపుత్రి అవార్డు (1992), రాజీవ్‌గాంధీ సద్భావనా అవార్డు (1993), యునెస్కో పీస్ ఫౌండేషన్ అవార్డు (1994), భారత శ్రేష్ఠ అవార్డు (1994).

సేకరణ జి.కవిత

ఉంది.''

నేను ఆమెవైపు ఒకసారి చూసి అన్నాను — ''ఉద్యోగపు బాధ్యతలతోపాటు ఈ అదనపు ఆకాంక్షకూడానా? అయినా ఈ చింతన చిన్న వయసులో పనికిరాదని పెద్దలు అంటూం టారు. పైగా మీకు చెప్పగలిగేటంత అనుభవం నాకుందని నేను అనుకోవాలిగా?''

''మీకు తెలిసిందే చెప్పండి'' అంటూ, గోడ మీద శ్రీ అరబిందో, మదర్‌ల ఫోటో చూసి, ''మీరు వారి భక్తులా?'' అంది.

''నేను ఒట్టి సాధకుణ్ణి.''

''మీ దగ్గర వారి పుస్తకాలు ఉన్నాయా? నేను చూడవచ్చా?''

''ఆ రేక్‌లో పుస్తకాల్లో చాలామటుకు అవే. మీరు చూస్తూ ఉండండి, నేను టీ తీసుకుని వస్తాను'' అని లేచాను. టీ కలపడానికి అయిదు నిముషాలు పట్టింది. నేను వచ్చేసరికి సజ్ తన డైరీలో ఏదో రాసుకుంటోంది.

''టీ తాగండి!'' కప్పు సజ్‌కు అందించాను. ఇద్దరం నిశ్శబ్దంగా టీ తాగాం.

''నేను మీ శ్రీ అరబిందో రాసిన ఎస్సేస్ ఆన్ గీత, మదర్ చదివాను.''

''అలానా?''

''వారి పరిపూర్ణ యోగం గురించి చెప్పండి.''

నేను నవ్వాను. ''ఒకవేళ నేను సరిగ్గా చెప్ప లేకపోతే, మీకు తెలుసుంటే నన్ను కరెక్ట్ చేయ వచ్చు. వారి యోగం — మనిషిని ఉన్నతికి ఎదుగుతూ స్వేచ్ఛాయుతుడై లోపరహితుడై ఉండమంటుంది. దానికితోడు మనిషిని ప్రపం చాన్ని విస్మరించకుండా, ఈ ప్రపంచం మహో న్నత స్థితికి చేరుకునేటందుకు అహర్నిశలూ కృషి చేయమంటుంది.''

సజ్ ఎడంచేత్తో చిన్నగా తల గోక్కుని, ''అర్థం కాలేదు'' అంది.

నేను నవ్వేశాను. ''శ్రీ అరబిందో ఆదర్శం — ఈ ప్రపంచాన్ని దైవానికి ప్రతిరూపంగా తీర్చిదిద్దడం. అందుకోసమే దైవాన్ని కొలవ మంటారు. ఆయన గురించి మాట్లాడమం టారు. ఆయన్ని అదే పరమాత్మని ప్రేమించ మంటారు. ఇంటిగ్రెల్ యోగం అంటే ఇదే.''

''ఈ యోగాన్ని ఎవరైనా అనుసరించ వచ్చా?''

''ఆఁ.'' అనేసి, ఏదో అనుమానంతో ఆమె వైపు చూసి అడిగాను — ''మీరు చూస్తే అవి వాహితుల్లా అనిపిస్తున్నారు. నిజమా, కాదా?''

''ఇంకా పెళ్లి కాలేదు.''

''మాలో చాలామంది దార్శనికులు బ్రహ్మ చారులే. అలాగే వైవాహిక జీవితం చూసి, ఆ పైన ఒంటరిగా యోగంలో అత్యున్నత స్థితికి వెళ్లినవాళ్లూ ఉన్నారు.''

''మీకు ఫిలాసఫీ అంటే ...''

''ఇష్టం'' అని ఆగి, ''అవునూ మీరు క్రిస్టి యన్ కదా! మా వేదాంతం మీకు సరిపడు తుందా?'' అన్నాను.

''క్రిస్టియన్ అయినంత మాత్రాన మరో మతం గురించి తెలుసుకుంటే తప్పేం ఉంది. మనో హృదయాన్ని తట్టి లేపేది — అది ఏ విష యమైనా గొప్పదే అవుతుంది.''

''ఇంతకీ మీరు వచ్చిన పని ...''

''ఎప్పుడు ఆలోచించినా, తీరిగ్గా ఉన్నా నా కేదో పోగొట్టుకున్నట్టుగా ఉంటుంది. అ దేమిటో తెలియదు. కానీ మీ దేశం వచ్చి రెండేళ్లు ఉన్న తర్వాత ఈ దేశం నాది అని అనిపిస్తుంది. ఒక తపన, ఒక ఆందోళన, ఒక 'అర్జ్'లాంటిది లోపలి నుంచి నన్ను పుష్ చేస్తు న్నట్టు ఉంటుంది.''

సజ్ ఆవేశంతో మాటలు ఆపి, తలను అటూ ఇటూ తిప్పి మౌనంగా నేలమీద ఏవో గీతలు గీస్తూ ఉండిపోయింది.

---

## కలలు

ఆడవారి కలల గురించి పరిశోధించిన వారు ఇలా తెలియపరుస్తున్నారు.

ఒక సంవత్సరానికి 2800 గంటలు ఆడవాళ్లు నిద్రపోతున్నారు. నిద్రలో సగంసేపు కలలు కంటున్నారు. ఆడవాళ్లు కనే కలలు ఎక్కువగా ఏడుపుతో, ఆవేశమైన కలలు వస్తాయి. ఆడవాళ్లు కనే కలలను 3 విధాలుగా చెప్పవచ్చు.

1. ఎక్కడో చాలా పైనుండి కిందపడుతున్నట్లు. 2. ఎంత తరిమినా పరిగెత్తలేక కాళ్లు నేలజారిపోవడం. 3. తప్పించుకోలేక దొరికిపోవడం.

పై వాటికి మేధావుల్లు ఇచ్చిన సమాచారం:

1. జీవితంలో భద్రత లేకపోవడం వల్ల. 2. జీవితంలో బాధ్యత లేకుండా ఉండిపోయాను అనుకోవడం వల్ల. 3. మనకి వయసైపోయింది. యవ్వనం తగ్గిపోతుంది అనుకోవడం వల్ల.

**సేకరణ:**

ముద్దా రమణమూర్తి (అనంతపురం)

---

''ముందు మీ రో మంచి భర్తను వెతు క్కోండి. కొందరు ఆడవాళ్లు సంసారంలో ఇమి డిపోయిన తర్వాత త్వరత్వరగా ఎదగడం మొదలుపెడతారట.''

సజ్ నావైపు అదోలా చూసింది. ఆమె కళ్లు నా సలహాకు ఆశ్చర్యపడ్డాయో, ఆందోళన చెందాయో నా కర్థం కాలేదు.

''మళ్లీ కలుద్దాం. మీ ఆఫీసుకు ఫోన్ చేసి చెప్తాను వచ్చేముందు.''

నేను లేచి ఆమెను వీధివరకూ సాగనం పాను.. ఆమె వెడుతూ, తన ట్రావెల్ బాగ్‌ను ఒక చేతి నుంచి మరో చేతికి మార్చుకుంది. మరికొంచెం దూరం వెళ్లి దాన్ని వీపును ఆన్చు కుంది. చటుక్కున నాకు — సజ్ చీర కట్టుకుంటే అందంగా కనిపిస్తుం దనిపించింది. చీర, రవిక, తలలో గులాబీ, మెళ్లో సన్నని చెయిన్, చేతికి గాజులు, నుదుట తిలకం — ఇవన్నీ అలంకరిం చుకుంటే సజ్ — సజ్జని అయితీరుతుందేమో!

నాకు నవ్వు వచ్చింది నా ఆలోచనా ధోర ణికి. వెంటనే వరండా వైపు వెళ్లి గంగానదిని చూస్తూ ఉండిపోయాను కొద్ది క్షణాలు. మనిషి చూపు నాలుగు గోడలకే పరిమితం కాకూడ దట! దృష్టికి విశాలత్వం అలవడాలంటే, మనిషి తరుచు ప్రకృతి ముందు విద్యార్థిలా నిలబడటం నేర్చుకోవాలిట!

★ ★ ★

నేను ఆ మర్నాడు వ్యాసకాశీ తదితర ప్రదే శాలు తిరిగాను. విశాలాక్షి దర్శనం అయింది. మాలవ్య గారి మేధస్సులో పుట్టి పెరిగిన బెనా రస్ హిందూ యూనివర్సిటీ చూశాను. ఆయన అహర్నిశలూ శ్రమించి ఆ విశ్వవిద్యా లయం కోసం డబ్బు పోగుచేశా డంటారు. కాలభైరవ స్వామిని దర్శించి ఆఖరిగా మా స్నేహితులు తెచ్చిపెట్టమన్న బనారస్ చీరల కోసం మెహరోత్రాగారి ఇంటికి వెళ్లాను. మెహ రోత్రాగారు రాజుకు మంచి స్నేహితులు. వారికి ఆ ఊళ్లో బట్టల దుకాణం ఉంది. వారిది వ్యాపారస్తుల కుటుంబం. ఆయన సహృద యంతో నన్ను ఆహ్వానించాడు. తన కుటుంబీ కులను పరిచయం చేశాడు. ఆడవాళ్లు కూడా మనసు విప్పి మా కుటుంబ విషయాలు అడి గారు. మెహరోత్రా గారు, ముందు నాకు టీ ఇచ్చి, ఆ తర్వాత బెనారస్ పాన్ నా చేతిలో పెట్టాడు. తమలపాకుల్లో వెన్న కూడా కలిపి పాన్ తయారుచేయడం అక్కడి ప్రత్యేకత. తరువాత ఇద్దరం వాళ్ల షాపుకి వెళ్లాం. నాకు నచ్చిన చీరలు తీసుకున్న తర్వాత చీర అంచు లమీద నాచేత సంతకం చేయించుకున్నారు. చీరల్ని వాళ్లు వి.పి.పి.లో పంపుతారు. అవును, మన సరుకు మనకు చేరిన తర్వాత, అది మనం ఎన్నుకున్న సరుకు కాదనే అను మానం రాకుండా, ఈ పద్ధతి అనుసరిస్తారట. సరిగ్గా అప్పుడే ఆ షాపులోకి రాఘవరావు మామయ్యా, లక్ష్మి అత్తయ్యా వచ్చారు. ఒక ళ్లను చూసి ఒకళ్లం ఆశ్చర్యపోయాం. వాళ్లు పదిహేను రోజులుగా ఉత్తరభారత దేశ యాత్రలో దేశం తిరుగుతున్నారట. ఇక్కడి నుంచి జమ్మూ, కాశ్మీరులు వెడతారట.


''ఎలాగూ ఇంతదూరం వచ్చావ్. మాతో రారాదా? ఇద్దరు స్నేహితులు అనారోగ్య కార ణంగా ప్రయాణం మానుకుని వెనక్కి వెళ్లిపో తున్నారు. మా జనానికి నేనే ఆర్గనైజర్‌ని కాబట్టి నీకు ఏ ఇబ్బందీ ఉండదు.'' మామయ్య అన్నాడు.

''అవకాశం వచ్చింది. మన భారతీయ సంస్కృతికి అన్నిరకాలుగా తలమానికంగా నిలుస్తుంది కాశ్మీరం. అక్కడి అందంలో గొప్ప అనుభవం దొరుకుతుంది. ఆ అనుభవమే చాలామందిని ఉన్నతికి తీసుకువెళ్లింది. గొప్ప గొప్ప పండితులకు, కవులకు, దార్శనికులకు

పుట్టినిల్లు కాశ్మీరం. వెళ్లిరండి!''

నేను హరిశ్చంద్రఘాట్‌కు వెళ్లి రూమ్ ఖాళీ చేసి బయటకు వస్తూంటే ఇంటి యజమాని, "మీ గురించి ఓ అబ్బాయిలాంటి అమ్మాయి — ఇంగ్లీషు పిల్లలా ఉంది, వచ్చింది'' అన్నాడు. నేను నవ్వేసి నా ప్రయాణం గురించి చెప్పి ఆయన దగ్గర సెలవు తీసుకున్నాను.

మేం మర్నాడు సాయంకాలానికి జమ్మూ చేరాం. అక్కడ రఘునాథను దర్శించుకున్నాం. ఊరు చూశాం. గవర్నమెంటు బస్సులో ఉదయం శ్రీనగర్‌కు బయలుదేరాం. అసలు ప్రకృతి, అందానికి వాకిళ్లు తెరవడం జమ్మూ నుంచే మొదలుపెడుతుంది. ఒకటే దారి, విశాలమైనదైనా ప్రతి ఫర్లాంగుకు ప్రమాద హెచ్చరికలు చేసే బోర్డులు. ప్రతి లోయలోనుంచి నిశ్శబ్దంగా పారే నీటి పాయలు — తావి నదినుంచి వచ్చిన శాఖోప శాఖ లేమో! రోడ్డు పక్కన కొండ చరియ ల్లోంచి జలధారలు ప్రయాణీకుల కోసం దారుల్ని నీటితో ప్రక్షాళనం చేయడం. బస్సు విండోలోనుంచి చూస్తే కనుచూపునంతా ఆక్రమించే చెట్లు. రకరకాల సొంపులు పోయే కొండలు. ఆ వాతావరణంలోకి ఒక పక్షిలాగ, ఒక పూ తీవెలాగ ఒక తావిలాగా రూపు దాల్చి మాయమవ్వా లనిపిస్తుంది. ఉదయపూర్ దాటాం. ఇంకా ఇంకా దూరంగా ప్రకృతిని బతిమిలాడుకుంటూ సాగిపోతున్నాం. బస్సు పాట్నీ టాప్ దగ్గర ఆగింది. జనం దిగారు. ఎండ విరుద్ధ వాతావరణంలో నిలవలేక చలికి పెద్ద చోటిచ్చి, తను సన్నసన్నగానే ఉండటానికి అలవాటుపడిం దనిపించింది. కైలాస్‌విష్ణు హోటల్‌లో టిఫెన్ తిన్నాం. ఆ ప్రదేశాల్లో కెల్లా ఎత్తైనది పాట్నీ టాప్ అంటారు. ఆ తర్వాత బని హాల్. సాయంత్రం నాలుగు కాకుండానే చుట్టూతా ఉన్న కొండలు తమ నీడలతో వెలుతురును తరిమికొడుతున్నాయి. చలిగా వణకడం, చలితో మాట్లాడటం, చలి నవ్వులు చిలకరించడం అందరికీ కొత్తగా ఉంది.


అనుపమ్ ఖేర్

## బాలీవుడ్ బాణీ

బాలీవుడ్‌లో మనకున్న కొంతమంది మంచి నటులలో అనుపమ్‌ఖేర్ ఒకరు. అయితే గత కొంతకాలంగా అవకాశాలు లేక ఖేర్ తెరమరుగైపోయాడు. ఆయన హీరోగా నటించిన 'దిల్ కా డాక్టర్'పై ప్రస్తుతం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా, వారిస్ హుస్సేన్ అనే యురోపియన్ దర్శకుడు తన 'సండే లాంగ్ జర్నీ' చిత్రంలో ఖేర్‌ను కొత్తకోణంలో చూపించనున్నారు. ఏ చిత్రం ఖేర్‌కు సవాలు లాంటిదని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు.

— మసూద్ అన్సారీ

శ్రీనగర్ జేరి టూరిస్ట్ డిపార్ట్‌మెంట్‌వారి సహకారంతో బోట్‌హౌస్‌లు మాట్లాడుకున్నాం. ఒక షికారి బేరసారాలు మొదలుపెట్టాడు. నేను నా కోసం ప్రత్యేకంగా బోటు మాట్లాడుతుంటే, మామయ్య తమ బోటులో ఉండమని వాడిని తిప్పికొట్టాడు. గట్టు నుంచి షికారీ, తన చిన్న పడవలో మమ్మల్ని 'గార్డెన్ ఆఫ్ ఈడెన్' అనే పేరుగల బోట్‌హౌస్ దగ్గర దింపాడు. లోపల ఆ పడవ రెండు గదులుగా మారింది. బయటికి వచ్చి నిలబడి చూడటానికి పోర్టికో.

మామయ్య బోట్‌హౌస్ అంతా చూసి — అత్తయ్యతో, "శ్రీమహావిష్ణువు లక్ష్మీసమేతంగా పాల సముద్రంమీద పవళించినట్టు ఇన్నాళ్లకు మనం జీలం నది మీద ఒక రాత్రి గడపబోతున్నాం. ఇది నిజంగా అదృష్టమే. నది మదిలాంటిది, హృదిలాంటిది'' అన్నాడు.

అత్తయ్య "చాల్లెండి!'' అంటూ నవ్వేసింది.

చీకట్లోంచి చిన్నపాటి వెలుగులా లోపల దీపాలు. షికారీ మాకు తినడానికి రొట్టెలు, పప్పుతో తయ్యారుచేసిన సాలన్ తెచ్చి ఇచ్చాడు. దూరంగా శ్రీనగర్ లైట్ల వెలుతురులో నిద్ర పోతోంది. "అదిగో, ఆ కొండమీదే శంకరాచార్యుల వారి పీఠం. చాలా ప్రశాంతంగా ఉంటుంది. అదిగో ఆ మాస్క్‌లోనే మహమ్మద్ గారి కేశం భద్రపరిచేది'' అంటూ మామయ్య చెబుతున్నాడు.

"మనం గుల్‌మార్గ్, పెహెల్‌గాం చూడాలి. శ్రావణమాసంలో అయితే అనంత్‌నాగ్ కూడా చూసేవాళ్లం. ఏం చేస్తాం!''


చీకట్లో, చలిలో భారతదేశం మమ్మల్ని తన శిరస్సు నెక్కించుకుని ప్రకృతిని చూడమంటోంది. యోగశాస్త్రంలో చెప్పే సప్త చక్రాలు భారతదేశానికి అన్వయించి చూస్తే ఏ ప్రదేశాన్ని ఏ చక్రంతో పోల్చవచ్చో? కానీ మన దేశానికి బుద్ధి కేంద్రం, బహుశా కాశ్మీరమే అయ్యుంటుంది!

మేము ఉదయం లేచి టూరిస్ట్ బస్‌స్టాండ్‌లో నిలబడ్డాం. మొదట గుల్‌మార్గ్, ఆ తర్వాత పెహల్‌గావ్ చూడాలి. గుల్‌మార్గ్‌లో భోజనాలు చేసి, అక్కడి నుంచి పెహల్‌గావ్ చేరాం. జనం ఎవరికి వారు విడిపోయి చూడవలసిన ప్రదేశాలు చూస్తున్నారు. మామయ్య, అత్తయ్య కాశ్మీర్ డ్రెస్‌లు వేసుకుని ఫోటోలు తీయించుకుంటున్నారు. నేను ఆ పక్కనున్న కొండ మీదకు ఉన్న దారిని పట్టుకుని కొంత దూరం వెళ్లాను. ఓ చదునైన ప్రదేశం కనబడింది. ఏదో చెప్పలేని ఆనందం నా చూపును చీల్చుకుని చూస్తే ఇంకా ఇంకా అందమైన దృశ్యాలు, కనబడనివి కనిపిస్తాయోమో నని నా కళ్లు పెద్దవి చేసి మరీ చూశాను. పరమాత్మ — ఆ ప్రదేశంలో ప్రకృతిని తన దివ్య శక్తులతో చిత్రించుకున్నా డనిపించింది. పరమాత్మ ఆరాధనలో లభించే పారవశ్యం మనకు ప్రకృతిలోతప్ప మ రెక్కడా లభించ దేమో!

నెమ్మదిగా వెనకనుంచి "హలో!'' అనే మాట వినిపించింది.

నేను వెనక్కి తిరిగి చూస్తే ఆ మాట సజ్‌గా కనిపించింది.

"నమస్తే, రావ్!'' అంది. హిందీ భాష ఇంగ్లీషు ఉచ్చారణలో వింతగా వినిపించింది.



## బాలీవుడ్ బాణీ..

జూహీచావ్లా, కరిష్మాకపూర్‌లకు ఒకే విషయంలో సారూప్యం ఉంది. అదేమిటంటే 'లూటేరే' షూటింగ్ సమయంలో దర్శకుడు జాప్యం సహించలేక, జూహీ అతన్ని కొట్టినంత పనిచేసింది. ఆ దర్శకుడే ప్రస్తుతం నిర్మిస్తున్న 'రాజా హిందూస్థానీ'లో కరిష్మాకపూర్‌దీ అదే పరిస్థితి. "తిను, తాగు... ఏమైనా చేయి... కాని సినిమా ఎప్పుడు అని అడక్కు" అనేది దర్శక మహాశయుడి సూత్రం. 'ఇదేం పిచ్చిరా బాబు' అని ఎ క్లా నటులు తెగబాధపడుతున్నారుట !

మసూద్ అన్సారి



— జూహీచావ్లా

పైగా ఆశ్చర్యం ఆమె బనారస్ పట్టు చీర ఎర్రంచులున్న నీలి వర్ణానిది కట్టుకుంది. ఎర్ర రంగు రవిక. కళ్లకు కాటుక, నుదుట తిలకం, చేతులకు గాజులు.

నేను నవ్వేశాను.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"క్రీస్తూ, కృష్ణుడూ ఉమ్మడిగా ఓ అమ్మాయిని తయారుచేసి ప్రాణం పోసి, భువికి పంపితే ఆ ప్రాణి అచ్చు మీరే అయ్యుంటారు."

"మంచిదేగా! అప్పుడు నాకు రెండు వైపుల నుంచి అడ్వాంటేజ్. అవునా?"

"అది సరే, మీ రింత దూరం రావడం ఎలా జరిగింది? మొన్న మీరు నాతో అనలేదే?"

"సడన్‌గా అమ్మా, నాన్నా ఫోన్ చేశారు — నా ప్రోగ్రాములన్నీ ఆపుజేసుకుని జెరూసలెం వచ్చేయమని."

"దేనికి?"

"పెళ్లి నిశ్చయం చేస్తారట."

"మంచిదే కదా!"

"నా ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలా, లేదా చెప్పండి. నాకు కోపం వచ్చింది. రాలే నని చెప్పేశాను. వెంటనే ఇటు రావాలనిపించింది."

"వాళ్లు బాధపడతారేమో?"

"ఈ మాట మావాళ్లు కూడా అనుకోవాలి కదా!" అంది. భుజం మీద పమిట అవస్థ పెడుతుంటే దాన్ని సర్దుకోవడంలో సులువులు తెలియక నెత్తిమీద కప్పుకుంది.

"ఈ ప్రదేశం గురించి తెలుసా?"

"ఆఁ, బస్సులో పుస్తకాలు చదివాను. దైవం తనకు తాను పరవశించిపోవడానికే ఈ సృష్టి జరిపాడంటారు. నిజమే." నేను ఆమెవైపు చూశాను.

"ఒక మాట. నేను మీ దేశంలో ఉండిపోవాలనుకుంటున్నాను."

నేను నవ్వేశాను.

"నా మాటలు మీరు నమ్మడంలేదా?"

"నా ఉద్దేశం అది కాదు. ఈవేళ చాలా గొప్పగా అనిపించే ఈ దేశం, కొద్ది రోజులు, కొద్ది నెలల తర్వాత ఒంటరితనంతో విసిగినప్పుడు — ఇంతేనా అనిపించవచ్చు. పైగా జీవితాన్ని జీవించా లనుకున్నప్పుడు ఒంటరితనం ఆడవాళ్లకు మేలుకన్నా కీడు ఎక్కువ చేస్తుంది."

"పోనీ, మీ భారతీయుణ్ణి పెళ్లి చేసుకుంటే ఎలా ఉంటుంది?"

నేను మళ్లీ నవ్వేశాను.

"అదేమిటి నవ్వుతున్నారు?"

"మీకు నచ్చిన భారతీయుడు మీ తరహాలో ఆలోచించగలగాలి. లేకపోతే వేషం, భాష, మతం — ఇవన్నీ అవరోధాలు అవుతాయి."

"నేను పేరుకే ఇజ్రాయెల్‌దాన్ని. నేను రెండేళ్లుగా మాంసాహారం మానేశాను. డ్రింక్స్ అసలు అలవాటే లేదు. మీరు నమ్మరుగానీ, మొహం ఒకటీ ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే నేను మీ దేశస్థురాలినైపోతాను!" సజ్ నవ్వుతూ అంది.

"ఇదంతా అమ్మా, నాన్నల మీద కోపమేనా?"

"అంతా అదే అని అనలేను. మొదటిది ఈ దేశం, గాలి, కనబడని ఇక్కడి దేవుళ్లు, సింబాలిక్‌గా దేవుణ్ణి కొలిచే మీ ఆరాధనా భావం ఒక వైపు — అలాగే నన్ను పెళ్లి చేసుకోమని వేధించే మా రెలెటివ్ అంటే అసహ్యం మరో వైపు. ఆఖరిగా మా గురువు ఫ్రిట్జాఫ్ కేప్రా గారు. వారు హిందూ మతపు లోతులను వివరించే తీరు నన్ను సమ్మోహితురాల్ని చేసింది."

ఇంతలో మామయ్యా, అత్తయ్యా "ఇక్కడేం చేస్తున్నావురా?" అంటూ సజ్‌ను చూసి, "ఈమె ఎవరూ?" అంటూ అడిగారు.

"మనలాగే టూరిస్ట్. కాశీలో పరిచయం అయింది."

సజ్ వాళ్లిద్దరకూ నమస్తే చెప్పింది.

"మనం మరో పది నిముషాల్లో శ్రీనగర్ వెళ్లాలి. అక్కడ చూడవల్సినవి ఎన్నో ఉన్నాయి" అంటూ హడావుడిగా వెళ్లిపోయారు.

"నేను వీళ్లతో ఢిల్లీ వెళ్లి అక్కడి నుంచి మద్రాసు వెళ్లిపోతాను."

"అలానా!" అంటూ సజ్ ఆశ్చర్యపడి, "మీ గవర్నమెంటు నన్ను మద్రాసు వెళ్లమంది. అక్కడ నాలుగు రోజుల స్టే. పైగా స్టేట్ గెస్టను" అంది.

"అలానా! అయితే మా ఇంటికి రండి, అడ్రస్ ఇస్తాను."

సజ్ తల ఊపి, ఏదో గుర్తు వచ్చినట్టు చేతిలోని ఆటోమేటిక్ కెమెరా తీసుకుని — "చిన్న కోరిక. మ నిద్దరం ఫోటో దిగుదాం. అదీ ఈ ప్రదేశంలో. హృదయంలో కొన్ని జ్ఞాపకాలు ఎంత పదిలంగా దాచుకున్నా — రిఫరెన్స్ బుక్స్‌లాంటివి — ఈ ఫోటోలు, వీడియోలు. అవునా?"


నేను లేచాను. సజ్ నా ఫక్కగా వచ్చి నిలబడింది. కొన్ని నిముషాలపాటు కెమెరా మమ్మల్ని తన కన్ను ద్వారా లోలోపలికి తీసుకుంది.

"వెడదామా మరి!"

"మళ్లీ మద్రాసులో కలుద్దాం. నమస్తే!" అంటూ సజ్ తను వచ్చిన గ్రూప్ వాళ్లతో కలిసింది.

మామయ్యా, అత్తయ్యా దూరం నుంచి పిలుస్తుంటే నేను చేత్తో వస్తున్నానని చెప్పాను.

(ముగింపు వచ్చేవారం)




# యాత్రికులు

శ్రీసుభా

(గత వారం తరువాయి)

నేను మద్రాసు వెళ్లి డ్యూటీలో జేరాను. నా కాశీ ప్రయాణం, ఆ వివరాలూ అక్కలకు తెలియచేద్దామనుకునే లోపునే అక్క దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో సారాంశం — నన్ను అతి త్వరగా ఒక ఇంటివాణ్ణి కమ్మని. చాలా సంబంధాలు వస్తున్నాయనీ, అమ్మాయిల ఫోటోలు పంపుతున్నాననీ, ఏదో ఒకటి సెలెక్ట్ చేసుకోమనీను.



నేను చేతిలో నాలుగు పేజీల అక్క ఉత్తరం పట్టుకోవడం కొత్త కాదు. ఆమె ఎప్పుడూ అంతే. రాసిన విషయమే రాస్తుంది. అదే మాట అంటే — 'తోడబుట్టినవాళ్లు కాకపోతే పైవాళ్లు రాస్తార్రా ఇలా? ఎవరికి అవసరం' అంటుంది. అమ్మ కూడా అంతే. ఇంటికి వెళ్లగానే అన్నం పెట్టి, ఆపైన కూర నార వడ్డించి, వాటితోపాటు లోకహితాలు చెప్పేది. కోడల్ని చూసి కన్ను మూయాలని ఉందిరా అని కూడా అనేది. జీవితాంతం బ్రహ్మచారులుగా ఉండిపోదల్చుకున్నవాళ్లు వయసు వచ్చిన తర్వాత పడే ఇబ్బందులు ఎంత భయంకరంగా ఉంటాయో తను చెప్పి, అదే విషయాన్ని అక్కలచేతా, బావలచేతా చెప్పించేది.

"పెళ్లి చేసుకుంటా నని ఏడేళ్లుగా అంటున్నావ్! ఏదీ?"

"మీరు నొచ్చుకుంటారని పెళ్లి చేసుకుంటానంటున్నాను. అసలు ఎక్కడైనా ఎవరి పెళ్లి వాళ్లు చేసుకుంటా రేమిటి? అది అవ్వాలి, ఆ ఘడియ రావాలి" అన్నాను దాటేస్తూ, నవ్వేస్తూ.

"ఇదో వేదాంతం మళ్లీ!"

"అన్నయ్యకు ఇష్టమైన దేమిటో నాకు తెలుసమ్మా. ఆ పాండిచ్చేరి లేదూ — ఆ ఊరు! పదేళ్లు ఆ ఊళ్లో ఉండి వీడు నేర్చింది పొట్టకూటికి పనికివచ్చే చదువు కాదు, బ్రహ్మజ్ఞానం కోసం పరితపిస్తున్నాడు. పెళ్లాం, పిల్లలు సంసారం అంటే భయపడేవాడు సన్యాసి కావడానికి కూడా అర్హుడు కాదనే విషయం వీడికి ఎప్పుడు అర్థమవుతుందో?"

నేను నెమ్మదిగా అన్నాను — "అక్కయ్యా! శ్రీ అరబిందో ఆశ్రమం తనదైన జీవితాన్ని త్యజించమని చెప్పదు. జీవితాన్ని బహాముఖాలా దర్శించాలనీ, ఈ ప్రపంచాన్ని దైవానికి ప్రతిరూపంగా తీర్చిదిద్దాలని అంటుంది."


"వాళ్లు ఏమంటారని నిన్ను అడగటంలేదు. నీ నిర్ణయం చెప్పు."


నేను మాట్లాడలేదు. మౌనం మంచి జవాబే కాదు — దానికి వాతావరణాన్ని చల్లబరిచే గుణం కూడా ఉంది.

అక్క తల బాదుకుని వంటింట్లోకి వెళ్లిపోతే, తల్లి కళ్లనీళ్లు పెట్టుకుని మంచం మీద తల పక్కకు వాల్చి ఉండిపోయేది.

నాకు చిన్నతనం గుర్తొస్తోంది. ఎలిమెంటరీ స్కూలు, ఆ పైన చదువు ... ఎదగడం ... ప్రేమ పంచి ఇచ్చిన తండ్రి నా చిన్నతనంలోనే పోయాడు. అమ్మ తనే అన్నీ అయి సంసారాన్ని మోసింది. జీవితం అంటే భయం, ఒక విధమైన నిర్లిప్తత అప్పుడే అలవాటయ్యాయి. కానీ ... కానీ ఓ రోజు కిరణ్‌మూర్తి గారి పరిచయం లభించింది. మిత్రులతోపాటు ఆయన సమ్ముఖంలో కూర్చుని అతి దగ్గరగా ఆయన ఉపన్యాసాలు వినడం మొదలైంది. ఆయన గురువుగా కాకుండా, ఆప్తుడిగా అది దగ్గరగా

వచ్చి — వ్యక్తి నేర్వవలసిన, అలవర్చుకోవల్సిన విషయాల గురించి చెప్పేవారు. క్రమశిక్షణ, శరీరం పట్ల విధేయత, మనసు పరిశుభ్రమవడానికి పనికివచ్చే యోగం. ఆయన మాటలకు, సలహాలకు, సూక్తులకు మనసు వ్యతిరేకత కనబర్చేది కాదు. "జీవితం అంత అందమైనది అదే. దాన్ని మనం గుర్తించగలగాలి" అంటూ ఆయన చెప్పిన మాటలు ప్రతి ఉదయం గుర్తొచ్చేవి. ఏడాది ... రెండు ... మూడేళ్లు ... వెనక్కి తిరిగి చూస్తే — పదేళ్ల






నాటి నా స్వభావం నాది కాదేమోనని, దాన్ని నేను ఒక బరువుగా మోయవల్సివచ్చిందని అనిపించేది.

నవ్వొచ్చింది జ్ఞాపకాలకు! అక్క ఉత్తరం టేబుల్ మీద పెట్టాను. అతి మామూలుగా రెండు రోజులు గడిచాయి. ఆవేళ ఆదివారం.

సజ్ వస్తుందని ఇల్లంతా శుభ్రం చేశాను. వంట వండాను. స్వీట్స్ కొని తెచ్చాను. పది దాటింది. సజ్‌కు వీలు చిక్కలేదేమో! లేకపోతే ఆఫీసు విషయాల్లో తలమునకలవుతోందేమో అనుకుని కుర్చీలో కూలబడ్డాను. ఇంతలో హఠాత్తుగా గుమ్మం దగ్గర మెదిలి, ఆహ్వానం లేకుండా లోపలికి వచ్చిన వ్యక్తిని చూసి మొదట నేను ఆశ్చర్యపోయాను. మనిషి ఆరడుగుల పైనే ఉన్నాడు. బలిష్టంగా కనిపిస్తున్నాడు. అతని మొహం చూస్తే, అత నేదో క్రేఫ్ థాట్‌తో వచ్చినట్టు కనిపించాడు.

"నీ పేరు రావు కదా?"

"అవును, కూర్చోండి."

"సజ్ గురించి నేను ఢిల్లీలో, కాశీలో వెదికాను. కనిపించలేదు. టూ మచ్ ఆఫ్ హర్ ..."

నేను మాట్లాడలేదు.

"ఆమె నీతోపాటు బద్రీ వెళ్లిందని తెలిసింది. ఎక్కడుంది, సజ్?"

"సజ్ నాతోపాటు బద్రీ రాలేదు. మేం ఈమధ్య ఒకటి రెండుసార్లు కలిశాం. కలిసింది కూడా అనుకోకుండానే. ఆమె ఎక్కడ ఉందీ అంటే నేను 'ఇక్కడ ఉండదు' అని మాత్రమే చెప్పగలను."

అతగాడు బహుశా విల్సన్ అయి ఉండాలి. నా మాటలు అతనికి అర్థం కాక, ఆ అర్థం కాకపోవడంతోపాటు కోపాన్ని కలగజేశాయి.

"ఇలా పరాయి దేశస్తురాలితో నీ కేమిటి పని? ఆమెకూ, నీకూ ఏమిటి సంబంధం?"

నేను అతని కళ్లల్లోకి చూశాను. అతను క్షణంలో కళ్లను వాల్చుకున్నాడు.

"ఇంతకీ మీ రెవరో చెప్పడం మర్చిపోయారు. గుర్తు చేసుకోండి" అన్నాను. అని, "టీ తెస్తాను, వెళ్లకండి" అంటూ లోపలి గదిలోకి వెళ్లాను. ఓ అయిదారు నిముషాలు మనతో విభేదించే మనిషిని ఏకాంతంలో వదిలిపెడితే ఆ మనిషి కాస్త చల్లబడటానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. నేను రెండు కప్పులు టీ తెచ్చి ఒకటి విల్సన్‌కు ఇచ్చాను. అతగాడు టీ అందుకుని తాగడం మొదలుపెట్టాడు. తాగుతున్న మూలంగానే "థాంక్స్" అనే మాట పలికి ఉండడని నేను సరిపెట్టుకున్నాను. విల్సన్ టీ తాగి, కప్పు నేలమీద పెట్టి "నేను సజ్‌కు కాబోయే భర్తను. నా పేరు విల్సన్" అని జనాంతికంగా చెప్పాడు.

"చాలా సంతోషం."

"కానీ ..." అతను ఆగిపోయాడు.

"చెప్పండి."

"సజ్ నా సొత్తు. మేం బంధువులం. ఒక మతంవాళ్లం. ఆమె ఇండియా వచ్చి మతం మార్చుకుని, నీలాంటి బీదవాణ్ణి పెళ్లి చేసుకుని హీనంగా బతకడం నా కిష్టం లేదు. నువ్వు మాకు అడ్డు రావద్దు. వస్తే, తర్వాత పరిణామాలు ..." ఆగిపోయాడు.

నేను నవ్వేశాను. "ఒక విదేశీయురాలిగా ఆమె నాకు పరిచయం అయింది. నాకు ఆమె మీద అభిమానం, ఆప్యాయత ఉన్నాయో, లేదో, లేక ఆమెకు నేనంటే ఎంత గురి ఉందో — ఆ విషయా లేవీ నా ఆలోచనల్లోకి రాలేదు. ఇక మీరు ..."

"నేను ..."

"ఆమె ఎటువంటిదైనా కానివ్వండి. మీరు ఆమె గురించి పరాయివాళ్లముందు చులకనగా మాట్లాడటం సభ్యత కాదేమో?!"

విల్సన్ కుర్చీలోనుంచి లేచి, "నేను వెడుతున్నాను. ఒకవేళ సజ్ వస్తే ఈ గుమ్మం ఎక్కనివ్వద్దు. ఆమెను నా దారికి తెచ్చుకోవడం ఎలాగో నాకు తెలుసు!" అంటూ బయటకు వెళ్లిపోయాడు విసవిసా.

నేను తలుపు దగ్గరగా వేసి లోపలికి వెళ్లాను. మనసు కాస్తంత సంకోచించినట్టయింది. అవును, నిజమే. ఈమధ్య మనసు ఎవరు పెద్దగా మాట్లాడినా, కాస్తంత వ్యంగ్యం పాలు మాటల్లో కనిపించినా, మాటలు విషయానికి దూరమై పక్కదారుల్లోకి పోతున్నా సహించలేకపోతోంది. వాక్కుకు మూడు దశలు — పశ్యంతి మధ్యమా, వైఖరీ అని ఉంటాయంటారు. మొదటి రెండు దశల దగ్గర మాత్రమే వాక్కును నియంత్రణ చేయగలగడం ఎంత గొప్ప విషయం!

సజ్ ఆలోచనల్లోకి వచ్చింది. ఆమె మాట తీరు, ప్రవర్తన, స్నేహశీలతా గుర్తొస్తున్నాయి. అలాగే కాబోయే భర్త నని వచ్చిన విల్సన్ తీరు తెన్నులు, మాట్లాడే విధానం. ఇద్దరికీ ఎంత తేడా? ఇద్దరినీ పక్కపక్కన నిలబెట్టి భార్యాభర్తలుగా ఊహించడానికే భయం వేసింది. పక్కకు తిరిగాను. మరోపక్కకు తిరిగాను. మంచన మీద నుంచి లేచాను. ఎదురుగా శ్రీ అరబిందో, మదర్‌ల చిత్రపటాలు కనిపించాయి. అవును, వారం రోజుల్లో నేను పాండిచ్చేరి వెడుతున్నాను. అక్కడి ఆశ్రమం, అక్కడి ప్రశాంతత,అక్కడ అదృశ్యంగా ఆకు ఆకునా, పూవు పూవునా, వ్యక్తి వ్యక్తికీనా కనపడే నిర్మలత్వం నన్ను చాలా రోజులుగా ఆహ్వానిస్తూనే ఉన్నాయి. జీవితం అంటేనే యోగం అనే శ్రీ అరబిందుల మాటలు నాకు మంత్రముగ్ధంగా తోస్తాయి ఎప్పుడూ!

లేచి భోజనం చేసి చెయ్యి కడుక్కున్నాను. ఇంతలో బయట కోలాహలం వినపడింది. తలుపు తెరిచి చూశాను. పెద్దక్క, చిన్నక్క, బావలూ టాక్సీలోంచి దిగారు. నేను వీథిలోకి వెళ్లి వాళ్లను పలకరించాను.

"ఊళ్లో ఉన్నావురా! హడిలి చచ్చాం ఎక్కడికైనా పోయావేమో నని!"

"ఎక్కడికి పోతాను! ఉద్యోగం ఉంది కదా!"

"ఏమిట్రోయ్ నీరసంగా కనిపిస్తున్నావు? హోటల్ తిండి పడటంలేదేమో!"

"ఎంత చిక్కిపోయాడో?"

అందరం లోపలికి వెళ్లాం. వాళ్లు ఇల్లంతా కలయచూశారు. ఒక మంచం, ఒక చాప, నాలుగైదు గిన్నెలు, స్టౌ, రెండు కుర్చీలు — అన్నిటినీ పరిశీలించి చూసింది పెద్దక్క.

"ఒరేయ్! ఏడేళ్ల నుంచి ఇక్కడ ఉంటున్నావు. ఏం సామాన్లు అమర్చుకున్నావురా? రేపు పెళ్లి అయితే వచ్చే అమ్మాయి నానా ఇబ్బందీ పడుతుంది."

## బాలీవుడ్ బాణీ



### రాజీపడని శ్రీదేవి

అమెరికాలోని స్లోన్ కెటరింగ్ హాస్పిటల్ ఈ మధ్య అంతర్జాతీయంగా అప్రతిష్ఠపాలైన సంగతి తెలిసిందే. ప్రముఖ నటి శ్రీదేవి తల్లికి బ్రెయిన్ ఆపరేషన్ చేయబోయి, బ్రెయిన్‌లో మరో వైపు కోసి ఆమె ప్రాణం మీదికి తేవడం, చివరి క్షణంలో మరో హాస్పిటల్‌కు తీసుకువెళితే ఆమె బ్రతకడం తెలిసిందే. హాస్పిటల్‌పై పాతిక మిలియన్ డాలర్ల పరువునష్టం దావా వేయాలని నిర్ణయించుకుని, శ్రీదేవి అక్కడి పలువురు ప్రముఖ న్యాయవాదులను సంప్రదించింది. అయితే దావా విషయంలో ఆమె రాజీపడిందనీ, పది మిలియన్ డాలర్లు తీసుకోవడానికి అంగీకరించిందనీ వార్తలు వెలువడ్డాయి. దీనిపై శ్రీదేవి వివరణ ఇస్తూ "ఆ హాస్పిటల్ డాక్టర్ల నిర్లక్ష్యంపై వెనకడుగు వేసే ప్రశ్నే లేదు. రాజీపడటం అంతకన్నా లేదు. మా అమ్మ ఆరోగ్యం కన్నా డబ్బు ముఖ్యమా నాకు?" అంటూ మండిపడిందట ! ఇదేనా రాజీపడటం అంటే?

మసూద్ అన్సారి

"మీ తమ్ముడి ఆస్తి అంతా, అదిగో ఆ పుస్తకాలే — చూడు!" అని బావ బుక్ రేక్ దగ్గరకు వెళ్లి, "ఇవన్నీ ఆశ్రమం పుస్తకాల్లా కనిపిస్తున్నాయి" అన్నాడు.

"లిటరేచర్ పుస్తకాలు కూడా ఉన్నాయి, బావా!"

"బాగానే ఉంది గానీ, వాడికి అసలు విషయం చెప్పండి!" అంది పెద్దక్క.

"ఏమీ లేదోయ్! మేము తిరుపతి వెళ్లి, ఇటు వచ్చాం. ఈ ఊళ్లో నా స్నేహితుడు ఒకాయన ఉన్నాడు. ఆయనకు ఒక్కత్తే కూతురు. బాగా చదువుకుంది. రాజారావుగారు సాయంత్రం మనింటికి వస్తారు. రేపే పెళ్లి చూపులు. అదీ విషయం!"

నేను ఏమీ మాట్లాడలేదు.

"నువ్వు కాదన వనే మేమే నిర్ణయం తీసుకున్నాం. అమ్మ పోతూ పోతూ నీ గురించి ఎంత ఇది అయిందో అందరికీ తెలిసిందే! పెళ్లి చేసుకుని ఒక ఇంటివాడివి కా!"

"ఇలా ఎంతకాలం ఒంటరిగా ఉంటావ్? ఒక్కడివి వండుకు తింటూ రోజులు వెళ్లదీయడంలో ఏ మానందం ఉందిరా?"

"హాయిగా పెళ్లి చేసుకో! పిల్లల్ని కను, వాళ్లను పెంచి పెద్ద చెయ్యి. బాధ్యతల్లో కూడా ఒక చెప్పరాని అనుభూతి ఉంటుందోయ్?"

"మీరు వెళ్లి రాజారావుగారికి ఫోన్ చేయండి!" పెద్దక్క అంది.

మరో అరగంట అక్క లిద్దరూ, బావ లిద్దరూ నాకూ ఏవేవో చెప్తూనే ఉన్నారు. వాళ్లు వచ్చింది ముందు నాకు జ్ఞానోదయం కలగజేసి, ఆపైన నన్ను ఒక ఇంటివాణ్ణి చెయ్యాలనేమో! పెరిగిన తర్వాత, ఎదిగిన తర్వాత మగాడైనా, ఆడదైనా తన వనే విశ్వాసాల పట్టు కాస్త సడలించి, ఇంటినీ, సంఘాన్నీ, లోకాన్నీ చూసి వెరవాల్సి ఉంటుంది కాబోలు! అవివాహితులుగా ఉండిపోతామని చెప్పకనే చెప్పినా ఎవరూ ఆ మాట నమ్మరు. అసత్యమనో, అలా ఏటికి ఎదురీదడం తప్పనో, వ్యక్తిగత జీవితంలోకి చొరవగా ప్రవేశించి, ఆపైన ప్రశ్నించీ, బెదిరించీ — కుదర దనుకున్నప్పుడు లాలన చేసీ తమ దారికి తెచ్చుకోవాలని చూస్తారు.

ఆ రాత్రి డాబా మీద ఈ విషయమే నేను పెద్దక్కయ్యకు చెప్పాను. ఆఖరిగా అన్నాను —

"అక్కయ్యా! చాలామంది వ్యక్తిగత విషయాలకు, సంసార సుఖాలకు విలువ ఇస్తారు. జనజీవన ప్రవంతిలో కలిసిపోయి సుఖదుఃఖాల్ని అనుభవంలోకి తెచ్చుకుని, తద్వారా చుట్టూతా వాళ్లకు తెలిసి మేలూ, తెలియక కీడూ చేస్తూనే ఉంటారు. ఇ దో ప్రక్రియ. అయితే మరికొందరు — చాలా తక్కువమందే అను — నలుగురూ నడిచే బాటను కాదని, కనిపించిన చిన్న వెలుగును ఆలంబనగా చేసుకుని ఓ గొప్ప ప్రకాశం వైపు

ప్రస్థానాలు మొదలుపెడతారు. ఇది కాని పని ఎందుకవుతుంది? దేశానికి అన్ని రకాల, అన్ని వర్గాల ప్రజల అవసరం ఉన్నప్పుడు, సంఘానికి కొంచెం దూరంగా జరిగి, వేదాంతపు మహావృక్షం నీడన సేద దీరి కంటికి కనిపించకుండానే ప్రకృతిని అంతటా ఆక్రమించిన ఆ పరమాత్మ కోసం వెంపరలాడటం అన్యాయం, అక్రమం ఎలా అవుతాయి? నాలో స్థిరనివాసిగా ఉన్న దేవుణ్ణి నేను గుర్తించా లనుకుంటున్నాను. ఈ యాత్ర కష్టమైంది. సంసార యాత్రకన్నా జటిలమైంది. అయినా నాకు ఆ మార్గమమే ఉత్తమమైనదిగా అనిపిస్తోంది. ఏమంటావు?”

అక్కయ్య డాబా మీది చిన్ని వెలుగులో నా మొహంలోకి చూసింది. బుగ్గన చెయ్యి పెట్టుకుని వింటున్నది ఆగి, తన భంగిమలను మార్చుకుంది.

“నువ్వు నన్ను ఏమీ మాట్లాడకుండా చెయ్యాలని చూస్తున్నావ్? గొప్ప గొప్ప పుస్తకాలు చదివి, నిత్య జీవితంలో వాటిని ప్రయోగించడం ఘనకార్యమే. కానీ వద్దురా! ఈ దారి నువ్వనుకున్నంత సులువైనది కాదు. మంచి గురువు దొరకనప్పుడు ఈ మార్గంలో చాలా అవరోధాలు వస్తాయి. ఎవరైనా ఒక జీవితకాలం అంటే — చిన్నదేం కాదు, ఎన్నో ఆటుపోటులు వస్తాయి. నీ వెనక తమ్ముడొకడున్నాడు. వాడి చదువుంది. వాడి మా టేమిటి?”

“మీ రందరూ ఉండగా నాకు రఘు భారం కాదనే నా నమ్మకం.”

“పెళ్లి చేసుకో, పిల్లల్ని కను! వాళ్లను వృద్ధిలోకి తెచ్చి, ఆపైన నీ దారి నువ్వు వెతుక్కో. సంసారంలో ఉండి కూడా ఆధ్యాత్మికంగా ఎదిగినవాళ్లు నాకు తెలుసు. నిండా పాతిక సంవత్సరాలు నిండని నిన్ను మేం సన్యాసిగా ఊహించలేంరా!” అక్కయ్య పమిట కొంగుతో కళ్లు ఒత్తుకుంది.

“అక్కయ్యా!”

“ఇంతకాలం నువ్వు బాధపడతావని చెప్పలేదు. మా అమ్మాయి — అదే మన రాధకు నువ్వంటే ఎంత ఇష్టమో నీకు తెలియదురా! అది ఎన్నోసార్లు పరోక్షంగా నాతోనూ, వాళ్ల నాన్నగారితోనూ చెప్పకనే ఈ విషయం చెప్పింది. నువ్వూ, నీ నిర్ణయం దాని కెలా తెలిశాయో, అది చాలా బాధపడింది. ఇప్పుడది తనకు పెళ్లివద్దని మొరాయించుకు కూర్చుంది. మా కేం చేయాలో పాలుపోవడం లేదు.”

“అరె!”

“ఇవన్నీ నీకు ఇదివరకే చెప్పాననుకో, నేను నీకు స్వార్థపరురాలిగా కనిపించేదాన్ని. దాన్ని నువ్వు వేరేవిధంగా అంచనా వేయవచ్చు. నా భయ మేమిటంటే, అది కూడా పెళ్లి మానేసి ...” అక్కయ్య ఆగిపోయింది. మాటల్లో దైన్యం కనిపిస్తోంది.

“నేను రాధకు చెప్తాను, అక్కయ్యా!”

“నువ్వు నా మాటకు విలువ ఇవ్వనట్టే, అదీ నీ మాట విననంటుంది. న్యాయమే కదా! అప్పు డేం చేద్దాం, చెప్పు?”

నే నేం మాట్లాడలేదు. అక్కయ్య మాటలో తప్పు పట్టవలసిం దేమీ లేదు.

“ఆలోచించు! నీ ఒక్కడి నిర్ణయం మీద ఎందరి భవిష్యత్ ఆధారపడి ఉందో. కుటుంబాలూ, కాపురాలూ ఏ అలజడులూ, ఒత్తిడులూ లేకుండా ఓ నదీ ప్రవాహంలా పోవాలిరా! నువ్వు కొత్తదారిన వెడతానంటే, నీ వెనక ఆ కొత్తదారి వెంబడి మేమూ రావాల్సి ఉంటుంది.”

“నన్ను ఆలోచించుకోమనే కదా అక్కయ్యా, నువ్వు చెప్పేది!”

పెద్దక్క నవ్వింది. “ఆలోచించద్దురా! మా ఆలోచనలు మన్నించు! ఇది నాదీ, బావదీ, చిన్నక్కదీ — అందరి విన్నపం. సరేనా?”

నేను ఏదో చెప్పబోయాను.

“నేను కిందికి వెడుతున్నాను. ఆ రాజారావు గారూ, వారి అమ్మాయీ అంతా కట్టుకథ. ఇక మేం రేపు ఉదయం బండికి ఇంటికి పోతున్నాం. నీ నిర్ణయం చిన్న ఉత్తరంగా రాయి. సరేనా?” అంటూ పెద్దక్క మెట్లు దిగి కిందకు వెళ్లింది.

నేను ఆకాశం కింద, మిణుకుమిణుకు మనే నక్షత్రాల నీడన, నిశ్శబ్దంగా మా మాటలన్నీ విని కూడా నిశ్శబ్దాన్నే పాటిస్తున్న ప్రకృతి ఒడిలో అలా ఉండిపోయాను.

నాకు ఎదురైన సమస్య సామాన్యమైనది కాదని నాకు తెలుసు. ఒకటి రెండురోజులు ఆలోచించాను. కిరణ్మూర్తిగారు చటుక్కున గుర్తొచ్చారు. నేను ఏ పరిస్థితుల్లో ఉన్నదీ వివరిస్తూ ఆయనకు ఉత్తరం రాశాను. ఉత్తరం ఆఖర్న అతి త్వరలో పాండిచ్చేరి వచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటా నని దాన్ని ముగించాను. అలాగే అక్కయ్యకు ఓ పదిహేను రోజులు నాకు ఆలోచించుకునేందుకు టైము ఇవ్వమని ఉత్తరం రాసిపడేశాను. మనసు కొద్దిగా శాంతించినట్టు అయింది. అవును, కిరణ్మూర్తి గారు తరుచు అంటూండేవారు — ‘ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దానికి పరిష్కారం సమస్య వచ్చిన దిశలోనూ, ఎత్తులోనూ దొరకదు. సమస్యకు కొంచెం దూరంగా, దానికి కొంచెం ఎత్తుగా ఎదిగి మనం ఆలోచించాలి’ అని. మరో నాలుగు రోజులు గడిచాయి. మదర్ జన్మదినం ఆ మరునాడే. నాకు పాండిచ్చేరి వెళ్లాలనిపించింది. రెండు జతల బట్టలు సర్దుకుని పాండిచ్చేరి బయలుదేరాను. ఉదయం పదిగంటలకల్లా పాండిచ్చేరిలోని మిత్రుడు రాజేశం గదికి చేరగలిగాను.

“ఈవేళ మదర్ పుట్టినరోజు. నువ్వు అందుకే వచ్చావు కదూ?”

“అవును. పైగా నన్నో సమస్య చుట్టుముట్టింది. దానికి పరిష్కారం మదర్ ఇస్తుందనే ఆశతోనే వచ్చాను. కిరణ్మూర్తిగారికి కూడా ఉత్తరం రాశాను — సలహాకోసం” అంటూ రామేశానికి అంతా చెప్పాను.

రామేశం విని, “ఇది నా కథా, మన మిత్రుల కథలూనూ!” అంటూ నవ్వేశాడు.

“నా కథకు ముగింపు ఎలా ఉంటుందో!”

ఇద్దరం లేచి, స్నానాలు చేసి ఆశ్రమానికి బయలుదేరాం. ఆశ్రమంలో శ్రీ అరబిందో, మదర్ల సమాధి ముందు భక్తులు మైమరిచి మెడిటేషన్లో ఉన్నారు. మేమూ ఓ పక్కగా కూర్చున్నాం. అరగంట గడిచింది. ఇద్దరం లేచాం. ఆ చుట్టుపక్కల తిరిగాను నేను.

నా ఇంటిలాంటి ఆశ్రమం, నాకు గురుతుల్యులైన పెద్దలు, స్నేహితులు, అక్కడి చెట్లు, పువ్వులు, గాలి — అన్నీ నాకేసి చూస్తున్నట్టు, నన్నో కొత్త మనిషిగా గుర్తించినట్టు అనిపించింది. ఆశ్రమంలో కార్యక్రమాలన్నీ పూర్తి అయిన తర్వాత కిరణ్మూర్తి గారింటికి వెళ్లాను. చేతిలోని లిల్లీ పూవులు ఆయనచేత

## అత్తమామలు చూడని అల్లుడు

మీనాక్షీ శేషాద్రిపై మనసు పారేసుకుని, ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించి, దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి చిక్కుల్లోపడిన సంగతి తెలిసిందే. ఇటు రాజ్‌కుమార్‌కూ, అటు మీనాక్షికీ పెళ్లిళ్లైపోయి ఎవరిదారిన వా రున్నా అతను మాత్రం ఆమెపై ప్రేమను చంపుకోలేకపోతున్నాడు. మీనాక్షితో అతను తాజాగా నిర్మిస్తున్న ‘ఘాతక్’ చిత్రంలో నటించడానికి, మీనాక్షి ఇటీవలే కొత్త మొగుడు హరిష్ మైసోలిని అమెరికాలో వదిలేసి బొంబాయి వచ్చేసింది. కొసమెరుపు ఏమిటంటే, ఇంతవరకు అల్లుడిని చూడని మీనాక్షి తల్లిదండ్రులు కూడా అతన్ని అమెరికాలో వదిలేసిరావడంపై అసంతృప్తి పడ్డారట. ఇక కొత్త కథ మొదలవుతుందా?

మసూద్ అన్సారి



బాలీవుడ్ బాణీ

ఉంచి నమస్కరించాను. ఆయన నన్ను ఆశీర్వదించి, కూర్చోమని ఫ్రేం కుర్చీ చూపించారు.

"ఎలా ఉన్నావు భాస్కర్?" అంటూ మొదట ఆప్యాయంగా అడిగారు.

నేను వంచిన తల ఎత్తలేదు.

"నీ ఉత్తరం అందింది. చూశాను" అన్నారు.

నేను తలెత్తి ఆయన కళ్లల్లోకి చూసి, తల దించుకున్నాను. మా మధ్య కాసేపు నిశ్శబ్దం మిగిలింది.

"మీకు తెలుసా సార్! నా ఉద్దేశ్యం, ధ్యేయం ..."

ఆయన చిరునవ్వుతో — "అంతా నాకు తెలుసు. భాస్కర్! నువ్వు పెళ్లి చేసుకుని స్థిరపడటం మంచిది. అంతమాత్రాన నీ ఆశయానికి ఏ విధమైన దెబ్బా తగలదు. సంసారిగా మదర్‌ను, శ్రీ అరబిందోను కొలిచేవాళ్లు చాలా మంది ఉన్నారు. ఆ విషయం నీకూ తెల్సిందే! బ్రహ్మచారివై, ఆశ్రమవాసిగా ఉండే అవకాశం దొరకలేదనే చింత పెట్టుకోవడం అవివేకం. మేమెవరం అనుకున్న వెంటనే ఈ ఆశ్రమానికి రాలేకపోయాం. ఇక్కడికి రావాలి, స్థిరపడాలి అనే కోరిక వేరు, రాగలగడం వేరు. మదర్‌కు బాగా తెలుసు — ఎప్పుడు, ఎవరిని, ఏ తరుణంలో ఇటు రప్పించాలో. అంతే కదా!"

"అవును."

కాసేపు కిరణ్‌మూర్తిగారు మా కుటుంబంలోని వ్యక్తుల గురించి అడిగారు. నా భవిష్యత్ గురించి మాట్లాడారు. ఆఖరిసారిగా నేను ఆయన పాదాలు తాకి సెలవు తీసుకుంటూంటే ఆయన నన్ను దీవించారు. ఆశ్రమం వీధిగుండా మలుపు తిరిగి వెడుతూ వెనక్కి తిరిగి చూశాను. లోలోపలి నుంచి ఒక విధమైన అనుభూతి నన్ను కిందా మీదా చేసింది. కాదు నాలోని తపనను భుజం తట్టి పక్కకు తప్పించి అనుబంధం నాది పైచేయి అంటూ ముందడుగువేసింది. అన్నీ నీవే కాని ఏదీ నీది కాదు అనే ఓదార్పు — ఆకాంక్ష గట్టులు తెంచుకుని మనసును ముంచెత్తకుండా దానిమీద ముసుగు వేసింది.

ఆశ్రమం రోడ్డు నుంచి ఎడం పక్కకు తిరిగి వినాయకుడి గుడి దగ్గరకు వెడుతూంటే, వంద గజాల దూరం నుంచి నడిచి వస్తున్న రూపం దగ్గరవుతూ. పరిశీలనగా చూడటంతో అమ్మాయిగా మారి, నాకు ఎదురుగా, దగ్గరగా వస్తూ సజ్‌గా మారింది.

"మీరు ..." అంది ముందు తనే. తర్వాత "భాస్కర్‌గారూ! నమస్తే!" అంది నవ్వేస్తూ.

"మీరు ..." అన్నాను నేను.

"అదే, మీ రేమిటి ఇక్కడ?"

"మీరు ముందు చెప్పండి." సజ్ నా చేయి పుచ్చుకుంది. నడుస్తోంది.

"మీరు చెప్తే వింటాను మీ కథ."

"మద్రాసులోనే నా సమస్యను పరిష్కరించి పారేశాను. నేనే కాదు, విల్సన్ తన ప్రవర్తనతో పరిష్కారమార్గం చూపించాడు. ఇద్దరం చిన్న ఘర్షణలాంటిది ఫేస్ చేశాం. అతను తన కూడా నన్ను రమ్మనమంటాడు. రాలేనని చెప్పేశాను."

"మీ వాళ్లకు తెలుసా?"

"ఆ రాత్రే ఫోన్‌లో జరిగింది చెప్పాను. వాళ్లు ఫోన్‌లో విచారపడి ఏడుపు మొదలుపెడితే, నన్ను ఇండియాకు దత్తత ఇచ్చి ఓ పుణ్య కార్యం చేశామని గర్వపడమన్నాను."

"అలానా?" నాకు అనుకోకుండా నవ్వు వచ్చింది.

"ఆ తర్వాత ఆలోచించాను. మీ దగ్గరకు రావాలనుకున్నాను. కానీ మీ రిచ్చే సలహా ఏమిటో నాకు తెలుసు. అందుకే మీ దగ్గరకు రాకుండా మీ రిచ్చిన పుస్తకాలు చదివాను. ఆ తర్వాత ఇక్కడకు వచ్చి స్థిరపడటం అన్నిటి కన్నా ఉత్తమమైన మార్గం అనిపించింది, భాస్కర్!"

"అంటే ..."

"ఈ ఆశ్రమం, ఈ మనుషులు, ఈ వాతావరణం చూసిన తర్వాత నాకు ఇక్కడ ఉండిపోవాలనిపిస్తోంది. నా శరీరం నన్ను బాధపెట్టదనీ, కోరికలు నన్ను బాధపెట్టలేవనీ నాకు తెలుసు. మీకు చెప్పలేదు — నాకు పదేళ్లు వచ్చేవరకూ నేను ఓ నన్ ప్రాపకంలో పెరిగాను. ఆవిడ నాకు గురువు. నేను ఆమె శిష్యురాలిగా ఉండేదాన్ని. ఆవిడ చిన్నతనంలో నాకిచ్చిన శిక్షణ నా కింకా గుర్తుంది. అది నా ముందు జీవితంలో ఉపయోగపడాలనే నేను కోరుకుంటున్నాను. ఆశీర్వాదాల కోసం ఆవిడకు ఉత్తరం కూడా రాశాను. అలాగే మీ మదర్, మీ శ్రీ అరబిందో నాకు దారి చూపిస్తారని, నా జీవితాన్ని వాళ్ల చెప్పుచేతల్లోకి తీసుకుంటారని నమ్మకం, ఆశ." అని అంతా చెప్పి, "నేను మంచి పని చేశానా, లేదా? నిజం చెప్పండి!" అంది సవాల్‌గా.

"బహుశా మీ నిర్ణయం వెనక మదర్ ఆశీర్వాదాలు ఉండి ఉండాలి. రెండో విషయం — మీరు నా మదర్, నా అరబిందో అన్నారు. వారిద్దరు మనందరి వారూ కూడా! సరేనా?" అన్నాను.

"ఎస్ ఎస్!" అని సజ్ ఆగి, "అవునూ, మీ రేమిటి ఇలా వచ్చారు? అలవాటుగానా?" అడిగింది.

"కాదు."

"మా రూమ్‌కు వెడదాం. అక్కడ తీరిగ్గా మాట్లాడుకోవచ్చు."

ఓ గంటసేపు నేను సజ్ అతిథిగా 'మదర్స్ ఇంటర్నేషనల్ గెస్ట్ హౌస్'లో ఉన్నాను. సజ్‌కు నా చరిత్ర చెప్పాను. పదిహేనురోజుల క్రితం ఇంట్లో జరిగిన విషయాలు చెప్పాను. ఆశ్రమంలో నాకు గంట క్రితం దొరికిన సలహా, దీవెనల గురించి చెప్పాను.

"అదృష్టవంతులు మీరు!" అంది సజ్ అంతా విని.

"నేను కాదు, అదృష్టవంతులు మీరే!"

సజ్ నవ్వేసి, "పోనీ మనిద్దరం కూడా అదృష్టవంతులమే అనుకుందాం. ఎందుకంటే, మనం అందరం, అదే మనుషు లందరూ యాత్రికులే అవుతారు. ఎంతో దూరం నడిస్తే గానీ, ఎంతో శ్రమిస్తే గానీ గమ్యం చేరలేరు కదా!"

"నిజమే."

సజ్ నవ్వింది.

"నేను వెళ్లి వస్తాను" అంటూ లేచాను.

సజ్ నన్ను సాగనంపడానికి వీధి గేటు వరకూ వచ్చింది. వీడ్కోలుగా తన చేతిని ఊపింది. నెమ్మదిగా — "ప్లీజ్, రిమెంబర్ మి!" అంది.

నేను ఉలిక్కిపడ్డాను. మదర్ ఆశ్రమానికి వచ్చిన భక్తులు తిరిగి వెడుతుంటే ఎప్పుడూ కూడా 'మమ్మల్ని గుర్తుంచుకోండి' అనే వీడ్కోలు చెప్పేవారట. నేను వెనక్కి తిరిగి చూశాను.

చెయ్యి ఊపుతూ నుంచున్న సజ్ నాకు మదర్‌లాగే కనిపించింది. ●

